

**నిధులపై శ్వేతపత్రం ఇస్తారా?**

దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు కేసీఆర్ ఎందుకివ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు ప్రశ్నించారు. వివరాలు 6లో ▸



**రాష్ట్రంలో అవినీతి పాలన**

బీజేపీని గెలిపిస్తే బీసీని సీఎం చేయడానికి అధిష్ఠానం సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. వివరాలు 6లో ▸



**రహదారి పనులు ప్రారంభం**

నార్సింగి నుంచి శేరిపల్లి వెళ్లే రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. వివరాలు 7లో ▸

## న్యూస్‌రీల్

### 'స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి'



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

రామాయంపేట(మెదక్): ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సీఐ లక్ష్మీబాబు సూచించారు. ఎన్నికల దృష్ట్యా రామాయంపేటలో సోమవారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక సీఐ, ఎస్‌ఐ రంజిత్ ఆధ్వర్యంలో మార్చ్ నిర్వహించారు.

### బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

పెద్దశంకరంపేట(మెదక్): బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర ఓబీసీ అధ్యక్షుడు ఆలె భాస్కర్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోనికి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని, అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణలో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోణం విఠల్, శ్రావణ్‌కుమార్, కృష్ణ, సురేశ్, అనిల్, రాథోడ్, కుమార్ తదితరులున్నారు.

### మద్యం పట్టివేత



తనిఖీ బృందం పట్టుకున్న మద్యం, కారు

అల్లాదుర్గం(మెదక్): కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఎన్నికల అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. చిల్వెర ఐబీ చౌరస్తా వైపు నుంచి వట్‌పల్లి మండలం పోతులబోగుడ గ్రామానికి వెళ్తున్న ఓ కారును తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 240 ఐబీ క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు. కారు డ్రైవర్ అనిల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ: 43,200 ఉంటుందన్నారు.

### మద్యం దుకాణాలు బంద్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లిలో రెండు రోజుల ముందే మద్యం దుకాణాలు మూతపడ్డాయి. సోమవారం చిన్నశంకరంపేటలో వైన్ షాపునకు తాళం వేశారు. ఎన్నికల నేపథ్యంలో మూడు రోజుల పాటు వైన్స్‌షాపులు మూత పడతాయనే సమాచారంతో వివిధ పార్టీల నాయకులు తమకు కావాల్సిన మద్యాన్ని ముందే తీసుకువెళ్లడంతో స్టాక్ అంతా అయిపోయింది. దీంతో దుకాణాలును బంద్ చేశారు.

### ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వం నిర్లక్ష్యం

హుస్నాబాద్: దశాబ్దంగా నియామకాలు మరిచిందని, మేనిఫెస్టోలో ఇచ్చిన నిరుద్యోగ భృతి, నియామకాలు గురించి పట్టించుకోని బీఆర్‌ఎస్‌ను ఓడించాలని నిరుద్యోగ, విద్యార్థి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో వారు మాట్లాడారు. 10 ఏళ్లలో ప్రభుత్వం ఏ ఒక్కరికీ ఉద్యోగ అవకాశం కల్పించలేదన్నారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. పోటీ పరీక్షలకు సిద్ధమైతే ప్రతి పరీక్షా పత్రాలను లీక్ చేసిందని దుయ్యబట్టారు.

# హ్యాట్రిక్ కొడతాం



- ఇచ్చిన హామీలు నెరవేర్చాను
- నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా
- జిల్లాకేంద్రం, మెడికల్ కళాశాల
- ఎంసీహెచ్ ఆస్పత్రి, డయాలసిస్ కేంద్రం ఏర్పాటు
- 'సాక్షి'తో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి

భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమె సాక్షికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

మెదక్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా అలుపెరగని పోరాటం ఒకవైపు, సమైక్యాంధ్ర పాలకుల పెత్తనాన్ని ఎండగడుతూ ప్రజా ఉద్యమాల నిర్మాణం ఇంకోవైపు చేపట్టి స్వరాష్ట్ర ఉద్యమంలో ఎన్నో అవమానాలు భరించాం. చీత్కారాలకు గురయ్యా, కానీ ఏనాడూ ఉద్యమ పంథాను వదులుకోలేదు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వెన్నంటే ఉన్నాం. పోలీస్ నిర్బంధాలను తెంచుకుని సమైక్య పాలన నుంచి విముక్తి కోసం ఎత్తిన పిడికిలి దించలేదు. సబ్బండ వర్గాల మద్దతులో ఉద్యమాలు నడిపాం. 2001 నుంచి ప్రత్యక్షంగా పాల్గొన్నాను. కరీంనగర్‌లో ఏర్పాటు సింహగర్జన బహిరంగ సభకు వేలాది మంది జనసమీకరణ చేశాను.

➡ మొదటిసారిగా 2001లో రామాయంపేట జెడ్పీటీసీగా ఎన్నికై అనంతరం రాజీనామా చేసి 2004లో ఎమ్మెల్యేగా గెలుపొందాను. స్వరాష్ట్రం కోసం పదవులను గడ్డిపోచలా వదిలేశాను. నియోజకవర్గాల పునఃర్విభజనలో రామాయంపేట నియోజకవర్గం మెదక్‌లో విలీనం కావడంతో పూర్తిస్థాయిలో మెదక్‌పై దృష్టి సారించాను. కేసీఆర్ అండతో 2014లో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశాను. 2014–2018లో మెదక్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందాను. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూడోసారి సైతం

**దశాబ్దాల కల.. జిల్లా కేంద్ర ఏర్పాటు**

➡ మెదక్ నుంచి ఎంపీగా గెలుపొంది ప్రధానమంత్రి పదవి చేపట్టిన ఇందిరాగాంధీ సైతం మెదక్ జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయలేక పోయారు. 2014లో ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ మెదక్ వచ్చినప్పుడు 'నా బిడ్డ పద్మను గెలిపిస్తే జిల్లా కేంద్రం చేస్తానని' హామీ ఇచ్చారు. మాటకు కట్టుబడి సీఎం కేసీఆర్ 2016లో జిల్లా కేంద్రం ఏర్పాటు చేశారు. నేడు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల ఏర్పాటుతో పాలన ప్రజల ముంగిటికి వచ్చింది. అంతే కాకుండా రైల్వేలైన్ ఏర్పాటు విషయంలో పెద్దన్న పాత్ర పోషించాను. దాని కోసం భూసేకరణ మొదలుకుని రైలు కూత వినపడే వరకు కృషి చేశాను. దీంతో ఎన్నో ఏళ్లుగా ఎదురు చూసిన మెదక్ ప్రజల కల నెరవేరింది.

**డివిజన్ కేంద్రంగా రామాయంపేట**

➡ రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా చేయాలని ప్రజల నుంచి వస్తున్న డిమాండ్‌ను సీఎం కేసీఆర్ ముందు ఉంచాను. దీనితో ఆయన రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒకే నియోజకవర్గలో రెండు ఆర్డీవో కార్యాలయాలు ఒక్క మెదక్‌లోనే ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సౌకర్యార్థం ప్రభుత్వ డిగ్రి కళాశాలను సైతం తీసుకొచ్చాను.

**నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, భోజన వసతి**

➡ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ నియామకాల్లో మెదక్ నియోజకవర్గం నుంచి చాలా మంది యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించాలనే ఉద్దేశ్యంతో రామాయంపేట, మెదక్‌లో కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి శిక్షకులను హైదరాబాద్ నుంచి రప్పించి 3 వేల మంది నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ, భోజన వసతి కల్పించాం. దీంతో వేల మంది యువతీ, యువకులు ఉద్యోగాలు సాధించడంతో నాకు ఎంతో సంతోషం కలిగింది.

**ఆరోగ్యరంగంలో అగ్రగామి**

➡ వైద్య ఆరోగ్యరంగంలో ఎన్నో విజయాలు సాధించాం. ఒక్కప్పుడు మెదక్‌లో ఏరియా ఆస్పత్రి మాత్రమే ఉండేది. జిల్లా ఏర్పాటుతో దానిని అప్‌గ్రేడ్ చేసి జిల్లా ఆస్పత్రిగా మార్చాం. ప్రజలకు అవసరమైన అన్ని వసతి సౌకర్యాలు కల్పించాం. డయాలసిస్ వ్యాధిగ్రస్థులకు ప్రత్యేక ఏర్పాట్లుచేసి, 70 రకాలకు పైగా టెస్టులు, అవసరమైన వైద్యం అందించేలా చేశాం. అలాగే ఎంసీహెచ్ నిర్మించడంతో అందులో నెలకు 380 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేయించి అక్కడి ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చాను.

### ఈ సారి గెలవగానే మెదక్ రింగ్‌రోడ్డు..

ఈ సారి గెలవగానే మెదక్‌కు రింగ్‌రోడ్డు తీసుకొచ్చి పట్టణాన్ని ఆధునీకరిస్తాను. అలాగే ప్రజలు సేద తీరడానికి అందమైన పార్కు నిర్మాణం చేపడతాను. ఇప్పటికే ఏడుపాయలను టూరిజం స్పాట్‌గా తీర్చి దిద్దడానికి సీఎం కేసీఆర్ రూ.100 కోట్లు మంజూరు చేసిస్తూ జీవో జారీ చేశారు. వచ్చే నెలలో మా పార్టీ అధికారంలోకి రాగానే ఏడుపాయల పనులు ప్రారంభిస్తాం. పేదలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొనిరావడానికి మెదక్ పట్టణంలో పీజీ సెంటర్, ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయిస్తా. సీఎం కేసీఆర్ ఇటీవల మెదక్ వచ్చినప్పుడు ఈ రెండు కాలేజీల విషయంలో సాను కూలంగా స్పందించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా మూడోసారి అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే.

# ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్



- అభివృద్ధి, సంక్షేమమే మా బలం, బలగం
- ఉమ్మడి జిల్లాలో పదికి పది బీఆర్‌ఎస్ గెలుస్తుంది
- హస్తం, బీజేపీలకు ఓట్లేస్తే బోర్ బావులకు మీటర్లు ఖాయం
- ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ఓటరన్న రిస్క్ తీసుకోవద్దని అంటున్నారు ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజార్టీలు సాధించిన ఆయన మరోసారి సిద్దిపేట నుంచి బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను 'సాక్షి' పలకరించింది. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేయడం అంటే మూడు గంటల కరెంట్‌కు ఒప్పుకోవడమే అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి వెంట వెంటనే ఉద్యోగాలను భర్తీ చేస్తామంటున్నారు.**

సాక్షి, సిద్దిపేట: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అండ, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి బీఆర్‌ఎస్సే గెలుస్తుంది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తాం. తద్వారా ఈ జిల్లా పార్టీ కంచుకోటగా మరోసారి నిరూపితమవుతుంది. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారు. నాడు కాంగ్రెస్ పాలనలో పరిస్థితిని. నేడు బీఆర్‌ఎస్ పాలనలో పరిస్థితిని గుండె మీద చేయి వేసుకుని పరిశీలించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. నాడు కరువు, కాటకాలతో వలసల జిల్లాగా ఉన్న ఈ ప్రాంతం నేడు రెండు పంటలు పండే పచ్చని మాగాణిగా మారింది. నారాయణఖేడ్, జోగిపేట, జహీరాబాద్ ప్రాంతాల్లో వలసలు వాపస్ వచ్చాయి. కర్ణాటక సరిహద్దుల్లో ఉండడం వల్ల ప్రజలకు స్పష్టత వచ్చింది. మూడు, నాలుగు నియోజకవర్గాలకు ఆ రాష్ట్రంతో బాగా సంబంధాలుంటాయి. అక్కడ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు గ్యారంటీలు అమలు కాలేదు. ఆ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెనం పై నుంచి పొయ్యిలో పడినట్లు అయిందని అక్కడి ప్రజలు చర్చించుకుంటున్నారు. 8 గంటల కరెంట్ కాస్తా 3 గంటలకే పరిమితమైంది. అక్కడి రైతుబంధులు ఆపేశారు.

అలాగే స్కాలర్ షిప్‌లలో కోత, తాగు నీటికి, తిండి గింజలకు ఇబ్బందే ఉంది. అక్కడి బాధలు చూసి, ప్రత్యక్షంగా తెలుసుకుని బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తున్నారు.

**❖ మార్పు అంటే 3 గంటల కరెంటా?**

కాంగ్రెస్ వాళ్లు మార్పు అంటున్నారు. 24 గంటల కరెంట్ నుంచి 3 గంటలకు తగ్గించడమే మార్పా? ప్రజల జీవన విధానం, ఆర్థిక స్థితిగతుల్లో మార్పు రావాలి. కాంగ్రెస్ దేశంలో ఎక్కడా రూ. 1000 మించి పెన్షన్ ఇవ్వడం లేదు. నాడు అధికారంలో ఉన్నప్పుడూ ఇవ్వలేదు. నేడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనూ ఇవ్వడం లేదు. తెలంగాణలో ఇస్తామనడం ఇక్కడి ప్రజలను మభ్యపెట్టడమే.

**❖ నాన్ లోకల్స్**

కాంగ్రెస్ అధికారంలో వస్తే పైరవీకారులు, బ్రోకర్ల రాజ్యం వస్తుంది. రాహుల్, ప్రియాంక ఎన్నికల ముందే కనబడతారు. ఎన్నికల తర్వాత ఢిల్లీలో ఉంటారు. నేడు కర్ణాటకలో రాహుల్ జాడలేదు. ప్రియాంక పత్తాలేకుండా పోయింది. ప్రజలకు ఇచ్చి హామీలు అమలు చేయడం లేదు.

**❖ కేసీఆర్ అంటే నమ్మకం**

కేసీఆర్ అంటే నమ్మకం. కాంగ్రెస్ అంటే మోసం. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో రూ.400కే సిలిండర్, సౌభాగ్యలక్ష్మి ద్వారా మహిళలకు నెలకు రూ.3వేలు, ఆసరా రూ.5వేలు, పేదలకు సన్న బియ్యం అందిస్తాం. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.15లక్షలకు పెంచుతాం. అసైన్డ్ భూములు పట్టా భూములుగా మార్చడం, గురుకులాలను డిగ్రీ కళాశాలకు అప్‌గ్రేడ్ చేస్తాం. కానీ అసైన్డ్ భూములను ప్రభుత్వం తీసుకుంటుందని దుష్ప్రచారం చేస్తున్నారు. ఈ జిల్లా బిడ్డగా హామీ ఇస్తున్నా. ఒక్క గుంట భూమిని తీసుకోం. వాటికి పట్టాలిస్తాం.

# బీజేపీ గెలిస్తే 4 సిలిండర్లు ఉచితం

- పెట్రోల్‌పై వ్యాట్ తొలగిస్తాం
- ముస్లిం రిజర్వేషన్ ఎత్తివేస్తాం
- అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ



మాట్లాడుతున్న అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ

మెదక్: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ పేర్కొన్నారు. బీజేపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మెదక్ రాందాస్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. అస్సాంలో లీటర్ పెట్రోల్ ధర రూ.వంద లోపే ఉందని, తాము గెలుపొందితే తెలంగాణలో పెట్రోల్‌పై పన్ను ఎత్తివేస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు ముస్లింలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తున్నారని, బీజేపీ అధికారంలోకి రాగానే ముస్లింలకు ప్రత్యేకంగా ఇచ్చే రిజర్వేషన్ తొలగిస్తామని చెప్పారు. అలాగే రైతులకు క్వింటాలుకు రూ.3,100 చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అయోధ్యలో రామమందిరాన్ని నిర్మించామని గుర్తుచేశారు. అస్సాంలోని కామాఖ్యదేవి కృపతో తాను సీఎం అయ్యాయని, అలాగే ఏడుపాయల అమ్మవారు వనదుర్గామాతా కరుణతో బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని జోస్యం చెప్పారు. క్యాక్రమంలో బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్, అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, నందారెడ్డి, కరణం పరిణీత సత్యనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలు అమలు

- బీఆర్‌ఎస్‌కు వీడ్కోలు చెప్పండి
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే



అభివాదం చేస్తున్న మల్లికార్జున ఖర్గే, చిత్రంలో నియెజకవర్గ అభ్యర్థి రాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్, శివ్వంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మొదటగా ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. సోమవారం సాయత్రం మండల పరిధి చిన్నగొట్టిముక్కలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 1980లో మెదక్ నుంచి పోటీచేసి దివంగత ఇందిరాగాంధీ ఎంపీగా గెలిచినప్పటి నుంచి ఇందిరమ్మ కుటుంబానికి మెదక్ ప్రజలతో ప్రేమానుబంధం ఏర్పడిందన్నారు. ఇక్కడ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఇందిరాగాంధీ బీహెచ్‌ఈఎల్, డీఆర్‌డీఓ, ఎయిర్‌ఫోర్స్ అకాడమీలు ఎర్పాటు చేశారని గుర్తుచేశారు. అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి వీడ్కోలు చెప్పేందుకు ప్రజలు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. చేతిగుర్తుకు ఓటేసి నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ తనను దీవిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పోడు భూముల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో రాయపూర్ ఎమ్మెల్యే వికాస్ ఉపాధ్యాయ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు లక్ష్మీకాంతరావు, సుహాసినీరెడ్డి, శేషసాయిరెడ్డి, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా, సుధీర్‌రెడ్డి, కమల తదితరులు ఉన్నారు.

# 2 రోజుల ముందే అనుమతులు పొందాలి

- బల్క్ మెసేజ్‌లు బంద్
- నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు
- ఎన్నికల అధికారి రాజర్షిషా



హవేళిఘణాపూర్(మెదక్): ఎన్నికల నియమావళి ప్రకారం పోలింగ్ తేదీకి 72 గంటల ముందు స్టాండింగ్ అవర్, 48 గంటల నుంచి నిశ్శబ్ద వ్యవధి ప్రారంభమవుతుందని జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా తెలిపారు. సోమవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 28 సాయంత్రం 5 నుంచి పోలింగ్ ముగిసే వరకు నిశ్శబ్ద వ్యవధి అమలులో ఉంటుందని, కాబట్టి రెండు రోజుల ముందే పత్రికా ప్రకటనలకు అనుమతులు పొందాలని సూచించారు. అలాగే లోకల్ ఛానళ్లతో పాటు శాటిలైట్ ఛానళ్లలో కూడా ఎటువంటి రాజకీయ ప్రకటనలు చేయకూడదని ఆదేశించారు. 28 నుంచి 30 సాయంత్రం 5 గంటల వరకు బల్క్ మెసేజ్‌లను నిషేధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా బల్క్ మెసేజ్‌లు పంపితే 73373 40816కు ఫోన్, లేదా వాట్సప్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి**

30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల విధులకు వచ్చే సిబ్బందికి అన్ని వసతులు కల్పించాలని రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలకు చెందిన ఆర్‌ఓలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో సౌకర్యాలు కల్పించాలని, పోలింగ్ సామగ్రి సరఫరా, పోలింగ్ సిబ్బందికి సౌకర్యాలు, భోజనాలు , వెబ్ కాస్టింగ్, సీసీ కెమెరా, వీడియో రికార్డ్, సెక్యూరిటీ లాంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు**

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రాజర్షిషా ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటరు స్లిప్పుల పంపిణీ, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. అనంతరం రాజర్షిషా మాట్లాడుతూ పోలింగ్‌కు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# అభివృద్ధికి పాటు పడేవారిని ఆదరించాలి

- ఎక్స్‌ప్రెస్ బస్టాండు ఏర్పాటు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): అభివృద్ధికి పాటు పడేవారిని ఆదరించాలని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రామాయంపేటలో ర్యాలీ అనంతరం జరిగిన సభలో ఆమె ప్రచారరథంపై నుంచి మాట్లాడారు. తాను గెలిచిన తరువాత రామాయంపేటలో ఎక్స్‌ప్రెస్ బస్టాండు ఏర్పాటు చేయిస్తానని, అర్హులకు పింఛన్, రెండు పడకల ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మైనంపల్లి హన్మంతరావు మెదక్ ప్రజలను దొంగలుగా చిత్రీకరిస్తున్నారని, ఆయన వచ్చిన తరువాతనే మెదక్‌లో గొడవలు ప్రారంభయ్యాయని ఆరోపించారు. ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకోవాలని, అంతకంటే ముందు మైనంపల్లి రోహిత్ మర్యాద నేర్చుకోవాలని పద్మ సూచించారు. మైనంపల్లి కుట్రలకు తెర లేపుతున్నారని, మైనంపల్లికి బుద్ధిచెప్పే సమయం ఆసన్నమైందని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించాయి. తనకు ఓటువేసి గెలిపించాలని పద్మ మహిళలకు విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, పార్టీ నాయకులున్నారు.

### ● ఏడుపాయలకు కార్తీక శోభ





పున్నమి వెన్నెల్లో.. దీపాల కాంతుల్లో ఏడుపాయల ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఏడుపాయల్లో సోమవారం అఖండ దీపోత్సవం నిర్వహించారు. పాలక వర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అఖండ దీపాన్ని వెలిగించి కార్తీక దీపోత్సవాన్ని ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన మహిళలు ఆలయం ఎదుట, దారి పొడవునా, రాజగోపురం వద్ద ప్రమిదలు పేర్చి దీపాలు వెలిగించారు. మంజీరా నదిలో కార్తీక దీపాలు వదిలి మొక్కుకున్నారు. -పాపన్నపేట(మెదక్)

### ● చాకరిమెట్లలో పౌర్ణమి సందడి



ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల శ్రీ సహకార ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీకశోభ సంతరించుకుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి మండపంలో వందలాది మంది దంపతులు సామూహిక వ్రతాలు ఆచరించారు. ఉసిరవనం వద్ద మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆంజనేయశర్మ, ఈఓ సార శ్రీనివాస్, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, ప్రభుశర్మ, దేవిశ్రీ, తదితరులు ఉన్నారు. -శివ్వంపేట(నర్సాపూర్)

## క్లుప్తంగా

### పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ



మజీద్‌పల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి

వర్గల్(గజ్వేల్): శాంతియుత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ సోనమ్ టిన్సింగ్ భూటియా సూచించారు. సోమవారం ఆయన తొగుట సీఐ కమలాకర్, బేగంపేట ఎస్సై అరుణ్‌తో కలిసి మజీద్‌పల్లి, నెంటూరు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో అలసత్వం తగదన్నారు. ఎక్కడైనా ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిస్తే 8712667309 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

### ఓటు హక్కు వజ్రాయుధం



హుస్నాబాద్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

హుస్నాబాద్: ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సోమవారం పట్టణంలో ఎస్సై మహేష్ జార్ఖండ్ ఆర్మ్‌డ్ పోలీసులు, స్థానిక పోలీసులతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ ఓటు వజ్రాయుధం లాంటిదని, అసెంబ్లీ ఎన్నికల్లో తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉత్తమ నాయకుడికి ఓటు వేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

### జిల్లాలో 144 సెక్షన్ అమలు

సిద్దిపేటకమాన్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సిద్దిపేట సీపీ శ్వేత తెలిపారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి డిసెంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఈ నిబంధనలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. 30న ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా తిరగవద్దని సూచించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమాలను తప్పకుండా పాటించాలని తెలిపారు.

### ప్రలోభాలకు గురిచేయొద్దు



రికార్డులను పరిశీలిస్తున్న వివేక్ కుమార్ సిన్హా

దుబ్బాక: మద్యం, నగదు, డబ్బులతో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయవద్దని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకులు వివేక్ కుమార్ సిన్హా సూచించారు. సోమవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో అభ్యర్థుల ఖర్చుల రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీం అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, దుబ్బాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్, ఏఆర్ఓ వెంకట్ రెడ్డి తదితరులున్నారు.



# నిధులపై శ్వేతపత్రం ఇస్తారా..?

- చింతమడ్కలా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలే..
- బీజేపీ అభ్యర్థి, ఎమ్మెల్యే రఘునందన్‌రావు



దుబ్బాకలో మాట్లాడుతున్న మాధవనేని రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: 'నేను పుట్టి పెరిగి విద్యాబుద్ధులు నేర్చిన గడ్డ దుబ్బాక అంటే చాలా ప్రేమ' అని చెప్పిన కేసీఆర్.. చింతమడ్క లాగా దుబ్బాకలో ఇంటికి రూ.10 లక్షలు ఎందుకివ్వలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం దుబ్బాకలో ఆయన మాట్లాడారు. దుబ్బాక సభలో కేసీఆర్ ఈ ప్రాంతంపై కపట ప్రేమ ఒలకబోశారని..అంత ప్రేమ ఉన్నోడైతే సీఎం చదువుకున్న పాఠశాల భవనం, వేంకటేశ్వర ఆలయం ప్రారంభోత్సవాలకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేసీఆర్ అంటేనే అబద్ధాలని.. ఆయన చెప్పిన అబద్ధాల గురించి చెప్పాలంటే ఐదేళ్లు పడుతుందని విమర్శించారు.

### తండ్రీకొడుకు, అల్లుడికి నా మీద అంత కోపమెందుకో?

దుబ్బాకకు వరుసపెట్టి తండ్రీకొడుకు, అల్లుడు వచ్చి తనను ఇష్టం వచ్చినట్లు తిడుతుండ్రు అని రఘునందన్‌రావు ఆరోపించారు. అసలు మీరు ఏం చేశారని దుబ్బాకకు వస్తున్నరో ప్రజలకు వివరించాలని అన్నారు. మీరు చేసిన అరాచకాలకు జనానికి విరక్తి వచ్చే దుబ్బాకలో రఘునందన్‌రావు ఎమ్మెల్యే అయ్యాడన్న విషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. దుబ్బాక సభలో ఉద్యమకారుడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్వర్గీయ రామలింగారెడ్డి పేరు తీయడానికి కేసీఆర్‌కు ఎందుకు మనసు రావడం లేదని ప్రశ్నించారు.

### దుబ్బాకకు ఎన్ని నిధులు ఇచ్చారు?

గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లలకు నిధులెన్ని ఇచ్చారో.. దుబ్బాకకు ఏం చేశారో శ్వేత పత్రం ఇవ్వాలని కోరారు. 2016లో రామలింగారెడ్డి అడిగినప్పుడు దుబ్బాకకు రెవెన్యూ డివిజన్ ఎందుకివ్వలేదన్నారు. ఇప్పుడు ప్రభాకర్‌రెడ్డి గెలిస్తేనే ఇస్తారా.. ఇది ఎంత వరకు సమంజసమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పుడు గెలిపిస్తే అభివృద్ధి చేస్తాం అనడం చూస్తుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని చెప్పారు.

### ఈగ వాలినా ఊరుకోను

దుబ్బాక మీద పరాయి పెత్తనం ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదన్నారు. దుబ్బాక ప్రజల మీద ఈగ వాలిన ఊరుకోనన్నారు. దుబ్బాకలో దళితులకు దళిత బంధు, బీసీలకు బీసీ బంధు, పేదలకు



బీజేపీలో చేరుతున్న సీనియర్ నాయకులు శేఖర్

డబుల్ బెడ్రూంలు ఎందెకివ్వలేదో చెప్పాలన్నారు. దుబ్బాక ప్రజల ఆత్మగౌరవం మీద దెబ్బకొడితే నేను ఊరుకోనన్నారు. ప్రజల గుండెల్లో నిలిచిన రఘునందన్‌రావును తిడితే వారికి తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బాలేష్‌గౌడ్, ఎస్ఎన్ చారి, విభూషణ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులున్నారు.

### అందరికోసం పనిచేస్తా

చేగుంట(తూప్రాన్): అభిమానంతో గెలిపిస్తే అందరికోసం పనిచేస్తానని దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. సోమవారం పెద్దశివనూర్ గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అప్పాల శేఖర్‌తోపాటు 100 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దశివనూర్ గ్రామస్తులకు ఏ కష్టం వచ్చినా ముందుంటానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భూమలింగంగౌడ్, వెంగళ్‌రావు, అంజాగౌడ్, నగేష్, శోభన్, నర్సింలు పాల్గొన్నారు.

### హరీశ్.. దుబ్బాకకు ప్రథమ శత్రువు

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధిని అడ్డుకుంటున్న మంత్రి హరీశ్‌రావే దుబ్బాకకు ప్రథమ శత్రువని రఘునందన్‌రావు ఆరోపించారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా



మిరుదొడ్డిలో మాట్లాడుతున్న రఘునందన్ రావు

డుతూ... దుబ్బాక ఎమ్మెల్యేకు ఎక్కడ పేరొస్తదోనని హరీశ్ నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. దుబ్బాక అభివృద్ధిని కోసం హరీశ్, కేటీఆర్ చుట్టూ తిరిగి వినతులు సమర్పించినా బుట్టదాఖలు చేశారని మండిపడ్డారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తానంటున్న సీఎం కేసీఆర్ మాటలు నమ్మొద్దన్నారు. మిరుదొడ్డి మండలంలో అసైన్డ్ భూములను డ్రోన్ కెమెరాలతో ఎందుకు సర్వే చేయించారని ప్రశ్నించారు. డబ్బుల మూటలతో వచ్చిన వారికే బీఆర్ఎస్‌లో చోటు ఉందన్నారు. దుబ్బాక నియోజక వర్గంలో దళితబంధు, బీసీ బంధు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ గెలిస్తే పింఛన్‌లు రావని బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన బలం బలగం దుబ్బాక ప్రజలేనన్నారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, వైన్స్ మాత్రం వెలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం స్కీంలు, ఊర్ల పేర్లు, మనుషులను గుర్తించలేని బీఆర్ఎస్ అభ్యర్థి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మాత్రం తాగి తందనాలు ఆడడానికి మాత్రం పబ్బులు కావాలని అడుగుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మొగుళ్ళ మల్లేశం, మద్దెల రోశయ్య, మల్లన్న గారి భిక్షపతి, ఎల్కుల దేవరాజు పాల్గొన్నారు.

### ఆదరిస్తే.. అభివృద్ధి షికారే..

దుబ్బాక: పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా సోమవారం 17వ వార్డులో కౌన్సిలర్ పులిగారి కల్పన బజ్జీలు వేసి ఓటర్లను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు ఆసిఫ్, రాజమౌళి, భూంరెడ్డి, అశోక్, ప్రశాంత్, వీణ తదితరులున్నారు.



### తాతా.. కారును యాదుంచుకో

చేర్యాల(సిద్దిపేట): జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి మద్దతుగా మండల పరిధిలోని ఆకునూరులో బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోతి విజయ్ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటి వద్ద కూర్చున్న పెద్దాయనకు కారు గుర్తును చూపి ఓటేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో దాసు, కనకయ్య తదితరులున్నారు.



# బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): ప్రజల స్పందన చూస్తుంటే బీఆర్ఎస్ గెలుపు ఖాయమైందని, ఎక్కడ ప్రచారానికి వెళ్లినా పార్టీలో భారీగా చేరుతున్నారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం కూచారంకు చెందిన అంబేడ్కర్ సంఘం సభ్యులు 100 మంది, ముప్పిరెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ మండల ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు సతీశ్‌చారిలు గులాబీ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పురం మహేశ్, విఠల్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, దాసరి నరేష్, పురం రవి, రమేష్‌గౌడ్, మాంగ్యానాయక్, ఉదయ్‌రంజన్‌గౌడ్, వీరేష్‌గౌడ్ ఉన్నారు.

### మత్స్యకారుల మద్దతు బీఆర్ఎస్ పార్టీకే..

గజ్వేల్‌రూరల్: మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా నిలుద్దామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని పాండవుల చెరువు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, కుంటలలో చేప పిల్లలను వదులుతూ మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తున్నట్లు గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 6లక్షల మత్స్యకార సంఘం సభ్యత్వం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, గ్రామాల్లో ముదిరాజ్ భవనాల నిర్మాణం చేపట్టారన్నారు. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పూడికతీత పనులు చేపట్టి... కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ ప్రాజెక్టుల ద్వారా గోదావరి జలాలను నింపారన్నారు. గత ప్రభుత్వాలు ముదిరాజ్‌లను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించగా... తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం కృషి చేశారన్నారు. ఐదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 500 కోట్ల వ్యయంతో చేప పిల్లలను పంపిణీ చేయగా... ప్రతియేటా రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. చేపలను మార్కెటింగ్ చేసేందుకు ఫోర్, టూ వీలర్ వాహనాలను అందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కొంటమైన నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలి

- ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్

గజ్వేల్: 'రైతు బంధు' డబ్బులు రాకుండా అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ పిలుపునిచ్చారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌కు రైతుల్లో వస్తున్న ఆదరణ చూసి జీర్ణించుకోలేక ఆ రెండు పార్టీలు కుట్రలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. డిసెంబర్ 3 తర్వాత కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దీని తర్వాత ప్రభుత్వ పథకాల అమలుకు ఎలాంటి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న దేవీ రవీందర్

ఇబ్బంది ఉండబోదన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షుడు క్రిష్ణాగౌడ్, ఎంపీటీసీ ఆంజనేయులు, కౌన్సిలర్ చందు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

# రాముని బండలో కార్తీక పూజలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జంగంరెడ్డిపల్లిలోని రామునిబండ శ్రీకోదండ సీతా రామచంద్రస్వామి దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు ఆలయంలోని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సర్పంచ్ దంపతులతో పాటు మరో పది జంటలు సత్యనారాయణ వ్రతాలు ఆచరించారు. మహిళలు దీపారాధన చేశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపోచమ్మ శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మ చైర్మన్ రంగారెడ్డి, నరేష్, కుమార్, పావని, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అవినీతి పాలన



రోడ్ షో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్

- బీజేపీని గెలిపిస్తే బీసీ అభ్యర్థే సీఎం
- కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్

సిద్దిపేట కమాన్: రాష్ట్రంలో బీజేపీని గెలిపిస్తే బీసీని ముఖ్యమంత్రి చేయడానికి అధిష్టానం సిద్ధంగా ఉందని కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. సిద్దిపేట బీజేపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డికి మద్దతుగా పట్టణంలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అవినీతి పాలన సాగుతుందన్నారు. యువత పోరాటంతో తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ ఉద్యోగాల భర్తీని మరిచిపోయారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకే దళితబంధు పథకాన్ని మంజూరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో సీఎం విఫలమయ్యారని అన్నారు. నేటి రజాకారులైన బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి విముక్తి కలగాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం రూ.9లక్షల కోట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తామన్నారు. ఆడపిల్ల పుడితే రూ.2లక్షలు, ప్రతీ మహిళకు రూ.2500 చేయూత పథకం ద్వారా అందజేస్తామన్నారు. రూ.400కే గ్యాస్ సిలిండర్లు అందజేస్తామని, చమురు ధరలు తగ్గిస్తామని, డిగ్రీ చదివే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తామన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ఉందని, ఈ కేసులో ఎవరున్నా చట్టప్రకారం వదిలి పెట్టేది లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రోడ్డు షో రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, శ్రీనివాస్, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలను వంచించడమే బీఆర్ఎస్ నైజం

- కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

కొల్చారం(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను వంచించడమే నైజంగా పెట్టుకుందని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి ఆరోపించారు. సోమవారం రాత్రి మండలంలోని వరిగుంతం, సంగాయిపేట, చిన్నఘనాపూర్ గ్రామాల్లో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచార నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసి ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఇందిరమ్మ రాజ్యం మరోసారి రావాలంటే ప్రతి ఒక్కరూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం గౌడ్, గోవర్ధన్, శేఖర్, విజయ్ గౌడ్, శ్రీకాంత్, అరిగె కిష్టయ్య, ఉపేందర్, ఆగంగౌడ్, దర్శిరాజు, సుధీర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.



వరిగుంతంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

# ఓడిపోతామనే కేసీఆర్ కుట్రలు

- కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: గజ్వేల్, కామారెడ్డిలో ఓడిపోతానని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందనే భయంతో కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని గజ్వేల్ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను ప్రజల్లో బద్నామ్ చేయడానికి పత్రికల్లో నిత్యం 'రక్త చరిత్ర' పేరిట ప్రకటనలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. ఇదే క్రమంలో మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలోనూ కేసీఆర్, హరీశ్‌రావులు కోడి కత్తి దాడి చేయించుకుని... దానిని కాంగ్రెస్‌పై నెట్టేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. దాడి తర్వాత తన ఇంటిపై బీఆర్ఎస్ కార్యకర్తలను ఉసిగొలిపే ప్రమాదం ఉందన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడిని కాంగ్రెస్‌పై నెట్టే ప్రయత్నం చేసి ప్రజలను నమ్మించడంలో విఫలమయ్యారని తెలిపారు.



మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

# సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం

మునిపల్లి(అందోల్): సీఎం కేసీఆర్‌తోనే సంక్షేమం సాధ్యమవుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం జోగిపేటలో అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఆశీర్వాద సభకు వెళ్తున్న సందర్భంగా సాయికుమార్ మాట్లాడారు. క్రాంతికిరణ్‌ను రెండోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయికుమార్, శశికుమార్, ఆనంద్, భాస్కర్, నవాజ్‌రెడ్డి పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు



మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్ వాహనంలో లభ్యమైన మద్యం బాటిళ్లు

గజ్వేల్‌రూరల్: వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యం కాటన్లను ఎన్నికల పర్యవేక్షణ నిఘా అధికారులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలో ఎన్నికల నిఘా అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళికి చెందిన వాహనంలో నాలుగు కాటన్ల బీర్లు, మూడు కాటన్ల బ్లెండర్స్ ప్రైడ్ మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రొట్టెల రాందాస్‌కు చెందిన వాహనంలో సైతం పదమూడు కాటన్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

# వైభవంగా సహస్ర దీపాలంకరణ





ఆలయంలో వెలిగించిన దీపాలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు సహస్ర దీపాలంకరణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ముఖ మండపంలో శివలింగం, స్వస్తిక్, ఓం ఆకారాలలో దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ బాలాజీ, ఏఈఓ వైరాగ్యం అంజయ్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ పాల్గొన్నారు.